కథ

# తీరని కోరిక

## పాలంకి సత్య

సాయంత్రం ఇంటికి వచ్చి, స్కూటర్ స్టాండ్‌వేసి, ఇంటి తలుపు తట్టేలోగానే మా ఆవిడ తలుపుతీసి నవ్వుతూ ''లోపలకు రండి'' అంది. నేను ఆశ్చర్యంగా చూస్తూ లోపలకు నడిచాను. ''ముఖం కడుక్కురండి కాఫీ ఇస్తాను'' అంది. నేను బాత్రూంలోకి వెళ్లి ముఖం కడుక్కుని వచ్చేసరికి టీపాయ్ మీద వేడివేడిగా రెండు కప్పుల కాఫీ, పకోడీల ప్లేటూ, జిలేబీల ప్లేటూ ఉన్నాయి. '' ఏమిటి విశేషం'' అని అడిగితే ఆవిడ మూడ్ పాడవుతుందన్న భయంతో నేనేం మాట్లాడలేదు. సాయంత్రం ఇంటికి వచ్చాక వంటింట్లోకి వెళ్లి ఫ్లాస్కులోని కాఫీ, డబ్బాలో నుంచి బిస్కట్లో, జంతికలో తీసుకోడం నాకు అలవాటయిపోయింది. పిల్లలు వాళ్ల అమ్మమ్మగారి ఊరెళ్ళారు. కొంత విశ్రాంతి దొరకడంతో స్పెషల్స్ చేసిందనుకున్నాను.

ఇద్దరమూ కబుర్లు చెప్పుకుంటూ టిఫినూ, కాఫీ పూర్తి చేశాం. మా ఆవిడ ''బీచికెడదాం'' అంది. సరేనన్నాను. మా ఇంటికి బీచి దగ్గరే. ఇద్దరమూ నడిచి వెడదామనుకున్నాం. సాయంత్రం నీరెండ అందంగా ఉంది. సముద్రపుగాలి చల్లగా వీస్తోంది, గాలికి మా ఆవిడ ముఖం మీద ముంగురులు అందంగా పడుతున్నాయి. ఆవిడకేసి చూస్తూ నడుస్తూ ఉంటే బీచి అప్పుడే వచ్చేసిందా అన్పించింది. ఇద్దరం కెరటాలని చూస్తూ సముద్రం ఒడ్డున కూచున్నాం.

పూలదండలమ్మే అమ్మాయి వచ్చింది. ఒక మూర పూలదండ తీసుకుని ''పూబోడికి పూలు'' అన్నాను. ''అమ్మో కవిత్వం వచ్చేస్తోందే'' అంది. ''నిన్ను చూస్తే రాకుండా ఉంటుందా'' అన్నాను. ''ప్రకృతి సౌందర్యం ముందు నా అందమెంత'' అంది. ఆ రోజు పూర్ణిమ వెన్నెల వెలుగులలో, కెరటాల నురుగులతో సముద్రం మిలమిలా మెరిసిపోతుంది. ఇద్దరి మనస్సులూ తన్మయత్వంతో నిండిపోయాయి. ఇద్దరం ఒకేసారి ఇసకమీద ఐలవ్‌యూ అని రాశాం. ఆనందంగా నవ్వుకున్నాం.

ఇంటికి వచ్చాక ఆవిడ స్టౌ వెలిగించి బియ్యం, పప్పూ పెట్టింది. ఈలోగా నేను బంగాళాదుంపలు తరిగాను. ఆవిడ బంగాళాదుంపలు వేపడం చేస్తూంటే నేను అప్పడాలూ, వడియాలూ వేయించాను. ఆవిడ సాంబారు చేసే సరికి నేను కొబ్బరికాయ పచ్చడి చేశాను. ఇద్దరం పెళ్లైన కొత్తలోని విశేషాలు చెప్పుకుంటూ భోజనం చేశాం.

మా ఆవిడ హాల్లో టేప్‌రికార్డర్‌లో పాటలు పెట్టింది. 'గుండమ్మకథ' సినేమాపాటలు వస్తున్నాయి. కిటికీలోనుంచి సోఫాలోకి వెన్నెలకాంతిపడుతోంది. నేను లైటు ఆపేశాను. '' ఎంత హాయి ఈ రేయీ, ఎంత మధురమీ హాయీ'' పాట వస్తోంది, మా ఆవిడ గళంలో గళం కలిపి పాడసాగింది. ఆవిడ చాలా బాగా పాడుతుంది, ఇంకెంతో బాగా వంట చేస్తుంది. పెళ్లి చూపుల్లో ఈ రెండు గుణాలకే మా వాళ్లంతా ముగ్ధులై సంబంధం ఒ.కె..చేసేశారు.

''చందమామ చల్లగా పన్నీటి జల్లు చల్లగా'' అని ఆవిడ పాడుతుంటే నేను టేప్ ఆపేశాను. ఆ విషయం కూడా గమనించకుండా ఆవిడ పాట పూర్తి చేసింది. నేనామెను దగ్గరగా తీసుకున్నాను. తను నాలో ఒదిగిపోయింది. ఇద్దరిలో ఒకే ఊహ '' ఈ ఆనందం శాశ్వతంగా ఇలాగే ఉండిపోవాలి''.

మా కోరిక తీరలేదు. ముందురోజు పాడయిన టివిని మర్నాడే మెకానిక్ వచ్చి రిపేర్ చేసేశాడు. సోఫాలో దూరదూరంగా కూచుని, రిమోట్ కంట్రోల్ ఒకరి నుంచి ఒకరు లాక్కుంటూ, సీరియల్స్ చూస్తూ ఆవిడా, వార్తలూ, క్రీడలూ చూస్తూ నేనూ... స్వర్గం చేజారిపోయింది. లేక మేమే చేజార్చుకున్నామా?

★

